# ఆ ఉత్తరం

శ్రీ కె. వి. అప్పలాచార్య

ఆ రోజున వర్షం తీవ్రంగా కురుస్తోంది. కాలేజీకి శెలవు—ఏమీ తోచడం లేదు. ఖాళీగా యున్నపుడు ఏదో వకట్టి నెమరు వేస్తూ యుండడం అలవాటు—ఆ అలవాటుప్రకారం మా కుర్ర వెధవని పిలచి, ఓ గొడుగు ఇచ్చి పున్నయ్యకొట్లో పకోడీలు తెమ్మని పంపించాను డబ్బులిచ్చి—తృటిలో వాడు తెచ్చి ఇచ్చాడు—మెల్లగా వాడికి రెండు పకోడీలు ఇచ్చి సాగనంపాను—

ఒక్కొక్కటే తింటోంటే బుర్రలో భావ తరంగాలు చెలరేగాయి—చాల రోజుల నుంచి నేనూ ఒక స్త్రీసేవాలోలుడనవ్వాలని, స్త్రీలకు సమానహక్కులను యివ్వాలని, ఆదర్శజీవితములను భవించాలని యుండేది—

అదెలాగు సాగుతుందీ ?

చిన్నప్పుడే ఆడపిల్ల అనే ప్రాణిని అంటగట్టారు—పోనీ! సమాన హక్కుల నిద్దామా అంటే, సంసారంలోని కష్టసుఖాలను తెల్సుకొనేటంత స్థితికి రాలేదు—

ఇలా ఏవో మానవాతీతమైన ఊహాలోకంలో సంచరిస్తోనే పొట్లాం ఖాళీచేసాను—తర్వాత కార్యక్రమం ఆలోచిస్తో ఆ పొట్లాం కాగితాన్ని రెండు మూడు మార్లు పైకి క్రిందకు త్రిప్పాను—హఠాత్తుగా ఆ కాగితంలో నల్ల అక్షరాలు కనబడ్డాయి—ఆదుర్దాగా చదివాను—ఏముంది ? ? ?

క్షేమం

మదరాసు

20-10-44

ప్రియమైన సుశీలకి,

ఇక్కడంతా క్షేమం—నా క్రిందటి ఉత్తరాలకు జవాబు వ్రాయకపోవడం నీ మనోదౌర్బల్యమేనని గుర్తించాను—నీ క్షేమ సమాచారాలు బొత్తిగా తెలియడంలేదు—నువ్వింకా అంధకార ప్రపంచంలో విహరిస్తో కుళ్ళి కుమిలిపోతావనుకొంటాను—

పిచ్చిదానా ! లోకంలో దురాచారాలు పెరిగాయి—మనిద్దరి దుస్థితులకు కారకులెవరో ఆలోచించుకో ! సుశీ ! అజ్ఞానాంధకారంలో తలిదండ్రులు పెళ్లంటో బొమ్మల పెళ్ళిళ్లు చేసేసారు—తడిగుడ్డతో గొంతుకలు కోసేసారు—కాని ! దురదృష్టవశాత్తూ ఇద్దరమూ పతులను కోల్పోయిన అనాథ స్త్రీలమయ్యాము—

సుశీ ! స్త్రీయై పుట్టిన తరువాత స్త్రీ స్వాతంత్ర్యపు హక్కులకోసం పోరాడాలి—సంఘం అంటో ఇంకా భయపడుతున్నావని నాకు తెల్సు—సంఘాలన్నీ పయోముఖవిషకుంభనాలని తెలుసుకో ! భయపడినన్నాళ్ళు నేనూ భయపడ్డాను—ఇలా ఎంత కాలమని భయపడతాము ? తెగించి నా రాజుతో వచ్చేసానన్న సంగతి నీకు తెల్సిందే గదా ! తర్వాత కోడై కూడిన సంఘపు అరుపులన్నీ విన్నవేగా !

"నారపోసినవాడు నీరు పొయ్యడూ ?"

సుశీ ! ఈ ఉత్తరం వ్రాసే టైములో......

అబ్బ! చంద్రుడు షోడశకళాప్రపూర్ణుడై ప్రకాశిస్తున్నాడు—వన్నెల వెన్నెల చంద్రుడు గర్వంతో ఆకాశంమీద మెల్లగా పైకివస్తూ తన వెండి చంద్రికలను ప్రసరింపచేస్తున్నాడు—

సుశీ ! ఆ వెన్నెల ఆనందం ఎవరికి ?

నూతన దంపతులకు—ప్రేమోపాసకులకు—

సుశీ ! నీ జీవితంలో ఆవరించిన నీలిమునుగులను, నీ ప్రియుడు రామం వెన్నెల హస్తాలచే తొలగించేసుకో !

నా భవనంలో యున్న చిన్న ప్రసేదికలోని కోయిళ్లు—అబ్బ! నీలాగే విరహగీతాలు పాడుతున్నాయి—

సుశీ! ఈ కట్టడి జీవితం అనుభవించడం అసాధ్యం—కర్మవశాత్తూ స్త్రీలకు భర్తలు గతిస్తే మాత్రం ఆమె కోర్కెలు నశిస్తాయా? ఏ స్త్రీ తన యౌవ్వన సౌఖ్యాన్ని అనుభవించాలని కోరదూ?

నీ అమృతమయ జీవితంలో అకారణంగా హాలాహలము వొలకనే వొలికింది—కాని! వినోదాలు—విలాసాలు అక్కర్లేదా?

సుశీ! సంఘం నిన్నేమీ చేయలేదు—అవి వట్టి అరచే కుక్కలే! ఈనాటి స్వార్థపూరితమైన చవట సంఘాలలో స్వచ్ఛప్రేమకు స్థానమే లేదని నాకు తెల్సు—నిర్జీవ ప్రతిమవలె కాల్చిచంపే యీనాటి సంఘాలు ఏనాడు నశిస్తాయో గదా?


## జీవా

[స్టమక్ పవుడర్ ఆపరేషన్ అవసరం లేకుండా చికిత్స]

సకలవిధములగు కడుపు నొప్పులున్నూ Appendicitis అను కడుపునందు ఏర్పడు వ్యాధినిన్ని కడుపునందు గలుగు రణములు. గడ్డలు మొదలగువాటిని కడుపును ఆపరేషన్ చేయకనే ఈ ఔషధము వుత్తరవాదముతో గుణపరుచును. ఈ ఔషధమును మళయాళ అష్టాంగ హృదయము ననుసరించి మిక్కిలి ప్రయాసపడి తయారుచేయబడినది. ఈ ఔషధము, అర్సర్, మలబంధం, పుల్లతేనుపు, పేగులద్వా గలుగు అనేకవ్యాధులు, గుల్మం, భోజనమునకు మునుపో లేక తరువాతనో గలుగు కడుపునొప్పి మొదలగు అనేక సంకటములను ఖండితముగా గుణపరుచును. దీనివిషయమై విశేషముగా చెప్పనేల ఒకతూరి తెప్పించి భుజించిన యథార్థము తెలియును. సుఖపడవచ్చును.

30 దినములు 60 పూటలమందు 2-3-0.

**G. S. VASAN & CO.,**
2/7, Venkatesa Mastri St., Sowcarpet,
**G. T., Madras.**


సుశీ! లేచిరా! ధైర్యంతో కార్యం సాగించు—రుద్రమదేవి రణరంగంలోకి ఉరికినట్లు, చవట సంఘాలతో ఎదుర్కో—సుశీ! రహస్యం దాగదు—అందరి నోటా పడ్డావంటే, రామంగీచిన ప్రణయరేఖ చెరిగిపోతుంది—ఆనాడే హృదయ విపంచికలనుండి అపశృతులు మ్రోగుతాయి—ఆనాడే నీ హృదయ మందిరంలోని జీవనజ్యోతులు నశించి చీకటి చిందులాడుతుంది—ఆనాడే నీ హృదయ సముద్రంలో తుఫాను చెలరేగుతుంది—ఆనాడే సముద్రంలో చుక్కాని లేక చిక్కిన నీ జీవిత నావను దరిచేర్చేవారికోసం మొరపెట్టుకొంటావు—

అవేమీ లాభం లేదు—ముందే మేలుకో!

రామంతో లేచి వచ్చేయి——రామం నీ ప్రేమను భగ్నపరుచడని నాకు ధైర్యమే—సుశీ! అమాయకపు హృదయంలో అనవసరంగా వృధా కాలయాపనచేస్తూ అగ్నిజ్వాలలు పుట్టించుకోక! తెగించు—నీ వంటి యువతులు సాహసించిననాడే స్త్రీలకు స్వాతంత్ర్యము లభిస్తుంది—

సుశీ! ఈ వెన్నెలానందాన్ని నువ్వూ రామూ అనుభవించడం కోసం ప్రయత్నిస్తున్నా—విజయురాలవవుతావనుకొంటాను—

సుశీ! త్వరగా వచ్చేయి—అన్నింటికీ నేనున్నాగా! ఇలా వ్రాశానని అన్యధా తలంచకు—బాగా ఆలోచించుకో! ముందు ఉత్తరం ఆలస్యం చేయక—వ్రాయి—శలవు!

ఇట్లు
ప్రియసోదరి—ఇందిర.

ఉత్తరం పూర్తి అయింది—వళ్లు గగుర్పాటు చెందింది—స్త్రీసేవాలోలుడను అవాలంటే ఈ ఉత్తరం జాగ్రత్త పరచాలి—అయినా ఈ ఉత్తరం పకోడీలు అమ్ముకొనే వాడి కెట్లా వచ్చిందా అని నా సందేహం—

పాపం! సుశి బాలవితంతువు—రామూతో కాలేజీలోయున్న పరిచయంతో ప్రణయగాధగా

మారిపోయింది—అబ్బ! ఇందిర! ఎంత ధన్యురాలు—ఇందిర లేచిపోయిన సంగతులన్నీ నాకు తెల్సు—అప్పటివరకు ఇందిర మహానేరం చేసిందనుకొనేవాడ్ని—కాని! ఈ ఉత్తరం చదివిన తరువాత ఇందిర భావాలన్నీ హృదయంలో నాటుకుపోయి స్త్రీ స్వతంత్రంకోసం పాటుపడమని ఉద్బోధించాయి—కాని!

వారంరోజు లయింది—ఎక్కడ విన్నా శ్యామలరావుగారి అమ్మాయి సుశీల లేచిపోయిందని—నోరు నొప్పి పెట్టేదాకా అంతా కుక్కల్లాగ అరిచారు—

రోజూ స్వయంగా పకోడీలు అమ్ముకొనేవాడి దగ్గరకు వెళ్లి ఆ చిత్తు కాగితాలను పరీక్షించేవాడ్ని—నాయీ కార్యానికి పున్నయ్య ఆశ్చర్యపడేవాడు—

ఒక రోజున మాత్రం ఇంకో ఉత్తరం దొరికింది—అందులో......కనిలా రామూతో లేచిపోయానని, క్షమించాలని,...అంటూయుంది. ఆ ఉత్తరంలో—అది సుశీల వ్రాసిందే యని నాకు బాగా తెల్సు—

అయినా ఈ ఉత్తరం కూడా పున్నయ్య చిత్తు కాగితాల్లోకి ఎలా వచ్చిందాయని ఆరా తీసాను—

ఇంతా చేస్తే సుశీల తమ్ముడికి చిత్తు కాగితాలు అమ్ముకొనే అలవాటు యుందట—ఆ కాగితాలతోబాటే ఈ ఉత్తరాలు, తదితర ముఖ్య కాగితాలూ అమ్మివేసేవాడట—

అదొక సరదా పిల్లలకి!

పాపం! సుశీల, ఇందిర, ఈ సంఘానికి భయపడియుంటే ఎంత కష్టాలు అనుభవింతురో గదా?

సుశీల, ఇందిరలవంటి యువతులు నడుం కడితే స్త్రీలోకం బాగుపడుతుందేమో?

వారిద్దరి జీవితాలూ హాయిగా, సుఖంగా గడుస్తోంది ఇప్పటివరకు—అంతే ఆ ఉత్తరంలో...!


# నేప్రిన్

దెబ్బలు, కురుపులు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖవ్యాధులవలన కలిగిన పుండ్లు, తేలుకుట్టు, మూలశంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణచేస్తుంది. కొత్తచర్మం త్వరగా వచ్చేటందుకు సహాయపడుతుంది. ప్రతీయింటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

¼ ఔ. సీసా అణాలు 8. ½ ఔ. సీసా అణాలు 14.

# హేతెరిన

అతిసారానికి, జిగట, రక్త విరోచనాలకి
అద్భుతమైన ఔషధం.

అతిసారం, జిగట, రక్త విరోచనాలు, వాంతులు, జబ్బువల్ల వచ్చిన జ్వరం వీటిని తగ్గించును.

అసాధ్యమైన జబ్బులన్నీ ఈ మందుకి
సాధ్యమౌతాయి.

6 మాత్రలు గల పేకెట్ 4 అణాలు.

# క్యాప్సినాల్

దగ్గు, రొంపల్ని అశ్రద్ధగా చూడకండి.

ఎందుకంటే ఊపిరితిత్తులలో రకరకాల వ్యాధుల్ని తీసుకొస్తుంది. అలారాకుండా 'కాప్సినాల్' సహాయపడుతుంది.

దగ్గులు, రొంపలు, ఇన్ఫ్లుయన్జా, మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.

6 మాత్రలు గల పేకెట్టు 4 అణాలు.

అన్నిషాపులలోనూ దొరకును.

The Lustre Manufacturing Co.,
Bangalore City.